మొదలైన నామినేషన్ల పర్వం

- ఈ నెల 25తో ముగియనున్న గడువు
- మే 13న పోలింగ్, జూన్ 4న ఫలితాల వెల్లడి



నోటిఫికేషన్‌ను నోటీసు బోర్డుపై పబ్లిష్ చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

మంచిర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలకు సం బంధించి గురువారం నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నలుగురు స్వతంత్ర అభ్య ర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికలకు సంబంధించి గత నెల 16న కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయగా, ప్రధాన పార్టీలయిన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించాయి. షెడ్యూల్ ప్రకారం గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రి య ప్రారంభం కాగా, ఈ నెల 25 వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించనున్నారు. మే 13న లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనుండగా, జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

• నిఘా ముమ్మరం...

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికల కమిషన్ నిఘా ముమ్మరం చేసింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పటిష్ఠంగా అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది. ఇందులో భాగంగా అభ్యర్థుల ఎన్నికల ప్రచారం సరళిపై అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించనున్నారు. నగదు, బహుమతుల పంపకం, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను అడ్డుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిపై ఎన్నికల నియమావళి కింద కేసులు నమోదు చేయనున్నారు. జిల్లా యంత్రాంగం మొత్తం కేంద్ర ఎన్నికల కమిషన్ అజమాయిషీ కిందకు వెళ్లడంతో ఆంక్షలు పటిష్ఠంగా అమలు చేయనున్నారు.

• పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు...

లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. ఈ నెల 21వ తేదీ వరకు గేటెడ్ కమ్యూనిటీలు, ఆర్‌డబ్ల్యుఏల ప్రతినిధులతో ఓటింగ్‌పై అవగాహన, 22 నుంచి 28 వరకు సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే 29 నుంచి మే 5 వరకు వాక్ టూ పోలింగ్ స్టేషన్, 5కే రన్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మే 6 నుంచి 12వ తేదీ వరకు ఎస్ఎస్, ఎన్‌సీసీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులు, వాట్సాప్ గ్రూపులు, చాంబర్ ఆఫ్ కామర్స్‌తో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయనున్నారు.

• పూర్తయిన సిబ్బంది నియామకం

లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లాలో అవసరమైన సిబ్బంది నియామకం పూర్తయింది. చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల శాసనసభ నియోజక వర్గాల పరిధిలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం మొత్తం 4429 మంది సిబ్బంది నియామకం పూర్తి చేశారు. వీరిలో 1131 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1111 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2187 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణను ఇప్పటికే పూర్తి చేశారు.

• నేడు ప్రధాన పార్టీల అభ్యర్థులు దాఖలు

పార్లమెంటు ఎన్నికల బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థులు గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్), గోమాసే శ్రీనివాస్ (బీజేపీ), కొప్పుల ఈశ్వర్ (బీఆర్‌ఎస్)లు తమ నామినేషన్ల దాఖలుకు ముహూర్తం ఫిక్స్ చేశారు. ముగ్గురు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు శుక్రవారం తొలి సెట్ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అలాగే ఈ నెల 21, 24 తేదీలలో మరో సెట్ నామినేషన్లను దాఖలు చేయనున్నట్లు ప్రధాన పార్టీల అభ్యర్థులు తెలిపారు.

తొలి రోజు నాలుగు నామినేషన్లు దాఖలు

● అందరూ స్వతంత్ర అభ్యర్థులే..

పెద్దపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ (ఎస్సీ రిజర్వుడు) నియోజకవర్గ స్థానానికి గురువారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేశారు. అనంతరం దూడ మహిపాల్, దుర్గం రాజ్‌కుమార్, నూకల నవీన్, అక్కపాక తిరుపతిలు స్వతంత్ర అభ్యర్థులుగా ఒక సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం ఈ నెల 19న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరు కానున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ నామినేషన్ ఎప్పుడు దాఖలు చేయాలనే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అభ్యర్థులంతా మంచి ముహూర్తం చూసుకుని నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. నామినేషన్లు స్వీకరించే జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రధాన గేటు నుంచి మొదలుకుని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు పోలీసులు మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మొక్కుబడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రొడ్డ లక్ష్మి

కాసిపేట, ఏప్రిల్ 18: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సమావేశం మొక్కుబడిగా ముగిసింది. సమావేశానికి ఈజీఎస్, ఆరోగ్య, వ్యవసాయ శాఖ అధికారులు మినహా ఎవరూ హాజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తీర్మానాలు ప్రవేశపెట్టకుండానే సమావేశం ముగిసినట్లు ఎంపీపీ రొడ్డ లక్ష్మి ప్రకటించారు. జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీటీసీలు నవనందుల చంద్రమౌళి, మేరుగు పద్మ, అక్కెపల్లి లక్ష్మి, కొండబత్తుల రాంచందర్, కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

భీమిని, ఏప్రిల్ 18: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. ఎండలు పెరుగుతున్నందున ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఉపాధిహామీ పనుల వద్ద, వ్యవసాయ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, గ్రామాల్లో సబ్‌సెంటర్లను రోజూ తెరవాలని, చక్కటి ప్రణాళికలతో వైద్య సేవలు అందించాలని సూచించారు. డెంగ్యూ జ్వరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫిర్యాదులు వస్తే శాకాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. వైద్యులు కృష్ణ, హెచ్ఈఓ నాందేవ్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెచ్ఏలు ఉమాశంకర్, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డ్రైవర్లు, క్లీనర్లకు జీవో ప్రకారం వేతనాలివ్వాలి

ఏసీసీ, ఏప్రిల్ 18 : ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు, క్లీనర్లకు జీవో ప్రకారం వేతనాలు అందించాలని తెలంగాణ ప్రైవేటు విద్యాసంస్థల బస్ డ్రైవర్, క్లీనర్ల సంఘం నాయకులు అన్నారు. గురువారం ట్రస్మా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావుకు మంచిర్యాల పట్టణంలో వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు, ఆయాలు, అటెండర్ల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని, వేతనాలు పెంచాలని కోరారు. జైపాల్‌సింగ్, శేఖర్, సురేష్,మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

సమ్మర్ సైన్స్ క్యాంపును వినియోగించుకోవాలి

ఏసీసీ, ఏప్రిల్ 18: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో నిర్వహించనున్న సమ్మర్ సైన్స్ క్యాంపును విద్యార్థులు వినియోగించుకోవాలని డీఈవో యాదయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 26 నుంచి 15 రోజులపాటు 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబు 9849550200లో సంప్రదించాలన్నారు.

టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన



రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన

ఏసీసీ, ఏప్రిల్ 18: మంచిర్యాల టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ సిబ్బందికి ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై గురువారం హైటెక్‌సిటీ మంచిర్యాల క్లబ్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషారావు ఆధ్వర్యంలో సర్కిల్ సిబ్బందికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండెజబ్బు వయస్సుతో నిమిత్తం లేకుండా వస్తున్నాయన్నారు. ఆపదలో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందించి సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. కరెంటు షాక్, పాముకాటుకు గురైనప్పుడు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రులకు తరలించాలన్నారు. త్వరలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. కైసర్, రాజన్న, రాజం, శ్రీనివాస్, రెడ్‌క్రాస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సభ్యులు కాసర్ల శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌ను విస్మరిస్తున్న హెచ్‌సీఏ



మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 18: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌ను హైదరాబాద్ హెచ్‌సీఏ విస్మరిస్తోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైందని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బీసీసీఐ క్రికెట్ బోర్డుతోపాటు సుప్రీంకోర్టు ఆదేశాలను హెచ్‌సీఏ పాటించడం లేదని తెలిపారు. హెచ్‌సీఏ ధనార్జనే ధ్యేయంగా కార్యకలాపాలు సాగిస్తుందని, దీని వల్ల క్రీడాకారులు నష్టపోతున్నారని, ఇప్పటికైనా అలాంటి విధానాలు మానుకోవాలన్నారు. త్వరలోనే క్రీడాకారులతో సమావేశం నిర్వహిస్తానన్నారు. బెల్లంపల్లి కోఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, గణేష్, కర్నాకర్, పైడిమల్ల వర్షిత్, అభిలాష్ శేఖర్ పాల్గొన్నారు.

పరీక్షలను పరిశీలించిన డీఈవో

మందమర్రిరూరల్, ఏప్రిల్ 18: ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ 2 పరీక్షలను గురువారం డీఈవో యాదయ్య పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డికి సూచించారు. ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు.

ఎన్నికల పరిశీలకులను కలిసిన కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల ఖర్చుల పరిశీలకులుగా నియమితులైన సమీర్ నైరంతర్య ఐడీఎస్‌ను గురువారం పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్‌టీపీసీ అతిథి గృహానికి రాగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. మొక్కను అందజేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారంలో భాగంగా చేయనున్న ఖర్చుల వివరాలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 18: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 23 నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న ఉదయం 8 గంటలకు స్లాట్ ఓపెన్ అవుతుందని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగునీరు అందించడంపై రైతుల హర్షం



సాగునీటి కాలువలో ఎమ్మెల్యే చిత్రపటానికి జలాభిషేకం

దండేపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని తానిమడుగు 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ వద్ద రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చిత్రపటానికి జలాభిషేకం చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిమట్టం కనిష్ఠ స్థాయికి పడిపోయింది. సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరిక మేరకు ఆయకట్టు రైతుల పంటలను కాపాడేందుకు గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదల చేయించారన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పార్టీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

చెన్నూరు, ఏప్రిల్ 18 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సూచించారు. గురువారం కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ నెంబర్లు ఎవరికి చెప్పవద్దని, ఈ విషయాలను విద్యార్థులు తల్లిదండ్రులకు, బంధువులకు అవగాహన కల్పించాలన్నారు. చెన్నూరు టౌన్ సీఐ రవీందర్, తహసీల్దార్ మల్లికార్జున్, ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



బెల్లంపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బెల్లంపల్లి, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున ప్రజలకు అసౌకర్యం కలగకుండా కేంద్రాలను ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. గురువారం ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న పోలింగ్ కేంద్రాల మార్పు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి మండలంలోని 96 పోలింగ్ కేంద్రాన్ని కాశీజీశాఖ గ్రంథాలయం నుంచి భవిత డిగ్రీ కళాశాలకు, ఆకెనపల్లిలోని 36 పోలింగ్ కేంద్రాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నేతకానివాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మార్చామని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరు మే 13వ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, నీడ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.

తాండూర్: పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. తాండూర్ మండలంలో పోలింగ్ కేంద్రాల మార్పు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడు తూ మండలంలోని 128, 129 పోలింగ్ కేంద్రాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కిష్టంపేటలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలకు, 136 పోలింగ్ కేంద్రాన్ని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి రాజీవ్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి మార్చామని తెలిపారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శన

చెన్నూరు, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిందని చెన్నూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మే 13న జరగనున్న నోటీసు బోర్డుపై నోటిఫికేషన్‌ను పబ్లిష్ చేశారు. ఆమె మాట్లాడుతూ గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఫారం 1ను తహసీల్దార్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై పబ్లిష్ చేసినట్లు పేర్కొన్నారు.

కోటపల్లి: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డుపై ఎంపీడీవో ఆకుల భూమయ్య ఆధ్వర్యంలో అంటించారు. గ్రామ పంచాయతీల్లో నోటీసు బోర్డులో ఎన్నికల నోటిఫికేషన్ ప్రతిని అంటించాలని కార్యదర్శులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ లస్మయ్య, ఏపీవో బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భీమారం: పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని చెన్నూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి పోస్టర్లు ఉండకుండా చూడాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో నోటిఫికేషన్‌ను అంటించారు. ఎంపీడీవో రాథోడ్ రాధ, తహసీల్దార్ విశ్వంభర్, ఎంపీవో సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భానుడి భగభగ

● జిల్లాలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు



నిర్మానుష్యంగా మారిన దండేపల్లి బస్టాండ్ ప్రాంతం

మంచిర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హాజీపూర్ మండలంలో అత్యధికంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, వేమనపల్లి మండలంలో 43.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోటపల్లి మండలం దేవుల వాడలో 44.1 డిగ్రీలు, దండేపల్లి మం డలం వెల్గనూరులో 44.0, భీమిని మం డలంలో 43.6, కాసిపేట మండలం కొండాపూర్, జన్నారంలోని కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టు, దండేపల్లి మండలం లింగాపూర్‌లో 43.4 డిగ్రీలు, నెన్నెల, చెన్నూరు మండలం కొమ్మెరలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత లు నమోదయ్యాయి. జిల్లాలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల కార ణంగా వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిం ది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

దండేపల్లి: ఎండవేడితో ప్రజలు బేజారవుతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావడం లేదు. వ్యాపార సంస్థల మధ్యాహ్న సమయంలో దుకాణలను మూసి ఉంచుతున్నారు. మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా అగుపిస్తున్నాయి.

తాగునీటికి అల్లాడుతున్న మూగజీవాలు



నస్పూర్, ఏప్రిల్ 18: మండుటెండలతో భూగర్భ జలాలు అడుగంటడం, వాగులు, కుంటలు, ఒర్రెల్లో నీరు లేక ఎండిపోయాయి. దీంతో పశువులు, పక్షులు దాహార్తితో తల్లడిల్లుతున్నాయి. దాహార్తిని తీర్చే నీటి తొట్లు ఎక్కడ అగుపించడం లేదు. పశువులు నల్లాల వద్దకు చేరుకుని దాహం తీర్చుకునే పరిస్థితి నెలకొంది. నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద గురువారం పశువులు నల్లా నీటిని తాగుతూ దాహార్తి తీర్చుకొంటోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి తొట్లను ఏర్పాటు చేయాల్సినవసరం ఎంతైనా ఉంది.

వడదెబ్బతో యువకుడి మృతి

ఏసీసీ, ఏప్రిల్ 18 : మంచిర్యాల పట్టణంలోని ఇక్బాల్‌అహ్మద్‌నగర్‌కు చెందిన షేక్ ఫరీద్‌పాషా (40) వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. మృతుడు బ్యాటరీల మరమ్మతు చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం పని నిమిత్తం బయటకు వెళ్లి వడదెబ్బకు గురై ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదురుగా పడి ఉండగా స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారన్నారు. వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడని పేర్కొన్నారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నట్లు తెలిపారు.

చురుగ్గా సాగుతున్న సోలార్ ప్లాంట్ పనులు

● సింగరేణి ఆధ్వర్యంలో శివలింగాపూర్ సమీపంలో ఏర్పాటు ● రూ.67 కోట్లతో 11 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం



పవర్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్లు

చెన్నూరు, ఏప్రిల్ 18: చెన్నూరు సిగలో మరో నగ చేరనుంది. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సౌర వెలుగులు విరజిమ్మనున్నాయి. మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు చకా చకా సాగుతున్నాయి. మూతపడిన శివలింగాపూర్ 1, 1ఏ బొగ్గు గని సమీపంలో సోలార్ ప్లాంట్ నిర్మాణానికి సింగరేణి సంస్థ 70 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో సుమారు రూ.67 కోట్లతో 11 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తి కావడంతో పనులను ప్రారంభించారు. పనులను పూణెకు చెందిన ఎన్‌రిచ్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. 2020లోనే ఆదాని ఇన్‌ఫ్రా ప్రైవేటు కంపెనీ ప్లాంట్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నా వివిధ కారణాలతో ఒప్పందం రద్దయ్యింది. సింగరేణి అధికారులు మళ్లీ టెండరు ప్రక్రియ నిర్వహించగా ఎన్‌రిచ్ ఎనర్జీ కంపెనీ పనులను దక్కించుకుంది.

- చురుగ్గా సాగుతున్న పనులు

సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు పది నెలల క్రితం ప్రారంభం కాగా భూమి చదును చేయడంతోపాటు ప్రతిపాదిత స్థలంలో స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభించారు. రెండు నెలలుగా ఈ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే 55 ఎకరాల భూమి చుట్టూ ప్రహారీ నిర్మాణ పనులు పూర్తి కాగా ముఖద్వారం పనులు, గేట్ల ఏర్పాటు పూర్తి చేశారు. లోపల 30 ఎకరాల్లో సోలార్ ప్లేట్లను బిగించారు. మరో 15 ఎకరాల్లో సోలార్ ప్లేట్ల నిర్మాణం కొనసాగుతోంది. ఈ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు అయితే ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ సింగరేణి విద్యుత్ కేంద్రం 132కేవీకి అందించనుంది. పనులు ఊపందుకోవడంతో మేనెల కల్లా పనులు పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

- స్థానికులకు ఉపాధి

సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వాచ్‌మన్ స్థాయి నుంచి బీటెక్ చదివిన నిరుద్యోగ యువతకు ఈ ప్లాంట్‌లో ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. ఇప్పటికే దీనిపై నిరుద్యోగులు ఆశతో ఉన్నారు. మరో వైపు ఉద్యోగావకాశాలపై ఎమ్మెల్యే వివేక్‌కు ఈ ప్రాంత నిరుద్యోగులు వినతి పత్రాలు అందించారు. ఆయన స్పందించి సింగరేణి అధికారులతో మాట్లాడి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. 15 సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతంలోని బొగ్గు గనులు మూతపడ్డాయి. ప్రస్తుతం మూతపడిన బొగ్గు గనుల ప్రాంతంలోనే సోలార్ ప్లాంటు నిర్మాణం అవుతుండడంతో ఈ ప్రాంతం మరోసారి సందడిగా మారనుంది.

వన్య ప్రాణులకు నీటి కొరత లేకుండా చూడాలి

వేమనపల్లి, ఏప్రిల్ 18: అడవిలోని వన్య ప్రాణు లకు నీటి కొరత లేకుండా చూడాలని బెల్లంపల్లి ఎఫ్‌డీవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వేమనపల్లి, కొత్తపల్లి అటవీ బీట్‌ల లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన నీటి కుంటల్లో నీరు ఉండేలా చూడాలన్నారు. అడవిలో మంటలు అంటుకోకుండా తగిన చర్యలు తీసుకో వాలన్నారు. అడవిలో బీడీలు, సిగరెట్‌లు కాల్చి పడేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ అధికారులు లక్ష్మీనారాయణ, శ్రీలత,ప్రణయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: అడవుల్లో ఏర్పడే అగ్ని ప్రమాదాల నివారణపై సర్వాయిపేటలో గురువారం అటవీ అభి వృద్ధి సంస్థ రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్ అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాల మీదుగా ఎవరైనా వెళ్లేటప్పుడు బీడీలు, సిగరెట్లు తాగి పడేయవద్దని తెలిపారు. ఒకవేళ అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, మంటలను ఆర్పి వేయడానికి సహకరించాలని కోరారు. అగ్ని ప్రమాదాల వల్ల పచ్చని చెట్లు, అడవుల తోపాటు వన్యప్రాణులు మృతి చెందుతాయ న్నారు. ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వాచర్ ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని సీఎంకు పోస్టుకార్డులు


పోస్ట్ కార్డులు చూపుతున్న రైతులు

చెన్నూరు, ఏప్రిల్ 18: ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కిష్టంపేట రైతులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపారు. వారు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదన్నారు. పంట కొనుగోలుపై క్వింటాల్‌కు రూ.500 బోనస్, రైతు భరోసా రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు, రైతు రుణమాఫీ రూ.2 లక్షలను వెంటనే అమలు చేయాలని కోరారు. రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్, ఎండిపోయిన పంటలకు ఎకరానికి నష్టపరిహారం రూ.25 వేలు చెల్లించాలని కార్డులో రాసి పోస్టు చేశామని పేర్కొన్నారు.

అలరించిన నృత్యాలు


నృత్యాలు చేస్తున్న యువతులు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 18: పట్టణంలోని యాపల్ కోదండరామాలయం వద్ద బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం సందర్భంగా తెలంగాణ క్రేజీ స్టార్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులు నిర్వహించిన శాస్త్రీయ, జానపద ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు అకాడమీ ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. శ్రీసాయి నాట్య కళానిలయం అశ్విని బృందం, నటరాజ కళా నిలయం అర్చనలు కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నరేష్, ప్రభాకర్, సింగర్ పద్మ, యూట్యూబ్ ఫోక్ స్టార్ తస్లీమా, కళ్యాణ్, జిల్లా కన్వీనర్, నాయకులు రాయలింగు, రిదం సది, తదితరులు పాల్గొన్నారు.

బీడు భూములను సస్యశ్యామలం చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు


మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి, ఏప్రిల్ 18: గోదావరి జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో నియోజకవర్గ కాం గ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం ఏడు అసెంబ్లీ నియో జకవర్గాల ప్రజలు కృషి చేయాలని అన్నారు. వంశీకృష్ణను ఇక్కడి ప్రజలు భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ వస్తే ఏదో జరుగుతుందనే ప్రజల ఆశలు నీరు గారిపోయాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పది ఏళ్ల పాలనలో ప్రజలు అన్ని రంగాల్లో దగా పడ్డారన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ అవినీతి కుంభ కోణాల్లో కూరుక పోయిన సీఎం కేసీఆర్ తాను సంపాదించిన ఆస్తు లతో పార్టీని నడిపించే రోజులు వచ్చాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో ప్రజలకు కష్టాలు


మ్యాదరిపేటలో ప్రచారం చేస్తున్న రఘునాథ్, నాయకులు

దండేపల్లి, ఏప్రిల్ 18: కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో అన్ని వర్గాల ప్రజలు, రైతులు కష్టాల కడలిలో చిక్కుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరవెల్లి రఘునాథ్ అన్నారు. గురువారం మ్యాదరిపేట, చింతపల్లి గ్రామల్లో పార్టీ శ్రేణులతో కలిసి పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల పేరుతో రైతులను మోసం చేస్తోందన్నారు. రైతులకు రూ.2లక్షల పంట రుణమాఫీ, రూ.15వేల రైతు భరోసా, కౌలు రైతులకు రూ.12వేల ఆర్థిక సాయం, వరికి క్వింటాల్‌కు 500 బోనస్ హామీ ఇచ్చి రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, కేంద్రాల వద్ద వసతులు కల్పించాలన్నారు. మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు అక్కల దివ్య, పార్టీ నాయకులు ప్రభాకర్, గురువయ్య, సురేందర్, లక్ష్మన్, సంతోష్, వెంకటేష్, అశోక్, సత్యనారాయణ, మహేష్, కిషన్ పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చూడాలి


పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కోటపల్లి, ఏప్రిల్ 18 : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని డీఎల్‌పీవో ధర్మరాణి అన్నారు. గురువారం నక్కలపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆమె మిషన్ భగీరథ పైపులైన్ నీటి లీకేజి నివారణ పనులను పర్యవేక్షించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షించాలని, సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు గ్రామపంచాయతీ ట్యాంకర్లతో వ్యవసాయ బోర్ల నుంచి నీరు తీసుకువచ్చి ప్రజలకు అందించాలన్నారు. ఎంపీడీవో భూమయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రినాధ్ స్వామి, కార్యదర్శి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హాజీపూర్, ఏప్రిల్ 18: మండలంలోని బుద్దిపల్లి గ్రామానికి చెందిన ముడిమడుగుల పోసు (68) గురువారం మంచిర్యాల ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోసు కొన్నేళ్ళుగా ఆస్తమా వ్యాధితో బాధపడుతోంది. ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలుకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

మృతదేహం ఆచూకీ గుర్తింపు

ఏసీసీ, ఏప్రిల్ 18: మంచిర్యాల బస్టాండ్ ఆవరణలో ఈ నెల 16న రాత్రి మృతి చెంది పడి ఉన్న వ్యక్తి ఆచూకీ గుర్తించినట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్ (33)గా గుర్తించారు. మంచిర్యాలలోని స్నేహితున్ని కలవడానికి వచ్చి వడదెబ్బ తగిలి మృతి చెందాడన్నారు. మృతుడు అవివాహితుడని తెలిపారు.

ఆర్టీవోకు సన్మానం

ఏసీసీ, ఏప్రిల్ 18: మంచిర్యాల రీజినల్ ట్రాన్స్‌పోర్టు అధికారిగా బాధ్యతలు చేపట్టిన సంతోష్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనే జింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సత్యపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం ఆర్టీవో కార్యాలయంలో సన్మానించారు. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న అంబులెన్స్, వైకుంఠరథం వాహనాలకు రాయితీ కల్పించాలని కోరారు. రక్తదాన శిబిరాలను నిర్వహించాలని కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 18 : లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించామని కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యేలు ప్రేంసాగర్‌రావు, వివేక్‌వెంకటస్వామి

ఏసీసీ, ఏప్రిల్ 18: మంచిర్యాల పట్టణంలోని 32వ వార్డుకు చెందిన ఆయిళ్ల విజయ్ ఆధ్వర్యంలో 40 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీలో చేరుతున్నారన్నారు. చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: రామారావుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తంగళ్లపల్లి వెంకటేశం, గోలి వెంకటేష్, బొద్దునా రాజేశం, మెరుగు సమ్మయ్యలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వివేకొవెంకటస్వామి సమక్షంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తిరుపతి, రమేష్, నామాల నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యతోనే మహిళల ప్రగతి


డీఈవోను సన్మానిస్తున్న శిక్షకులు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 18: విద్యతోనే మహిళా సాధికారత, అభివృద్ధి సాధ్యమని మంచిర్యాల డీఈవో యాదయ్య తెలిపారు. గురువారం శ్రీపతినగర్‌లోని వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్, సఖీ మంచిర్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఇస్తున్న శిక్షణ బాగుందని, విద్య ద్వారానే మహిళలు అభివృద్ధి చెందుతారన్నారు. పట్టుదలతో చదివితే ప్రతీ రంగంలో మహిళలు పైచేయి సాధిస్తారని చెప్పారు. మహిళలు వయస్సుతో సంబంధం లేకుండా పేర్లు నమోదు చేసుకొని విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న వారు ఇతరులకు కూడా శిక్షణను అందించాలన్నారు. దీంతో కుటుంబాల్లో పెద్ద దిక్కుగా మహిళలు ఉండే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా డీఈవోను సన్మానించారు. అనంతరం శిక్షకులు డీఈవోను సన్మానించారు. విద్యాశాఖ అధికారి పురుషోత్తంనాయక్, శాంఖరి, గోపిక, నరేష్, శిక్షకులు శారద పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18: పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా సిర్పూర్(001), ఆసిఫాబాద్(005) అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్, డీఈవో అశోక్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మే10లోగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు, మూత్ర శాలలు, ఫ్యాన్లు, ర్యాంపులు, ఇతరాత్ర పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు


గాయ పడ్డ విక్కు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని బూర్గుడ గ్రామసమీపంలోని అంతర్ రాష్ట్ర రహదారిపై గురువారం ఆటోబోల్తాపడి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని అప్పపల్లి గ్రామానికి చెందిన ఆటో ఆసిఫాబాద్ నుంచి అప్ప పల్లికి వెళ్లేక్రమంలో బూర్గుడ సమీపంలో ఎద్దు అడ్డురావడంతో దాన్ని ఢీకొని బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు చునార్కర్ విక్కుకు చెయ్యి విరిగి, తలకు గాయాలు కాగా వెంటనే స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు పని పూర్తి చేయాలి

కౌటాల, ఏప్రిల్ 18: మండలంలోని గుడ్లబోరి గ్రామానికి నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను పూర్తిచేయాలని గురువారం ఎంపీటీసీ వసంత్‌రావు ఆధ్వర్యంలో గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నికల ముందు 90శాతం పనిపూర్తిచేసి మిగితా బీటీ వేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ రాందాస్, వాయు కుమార్, సుశీల్, వంశీ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

దహెగాం, ఏప్రిల్ 18: ఎన్నికల నియమావళి పాటించాలని ఎస్సై రాజు అన్నారు. గురువారం దహెగాం మండలంలోని కల్వాడ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నగదు తీసుకెళ్లితే సరైన పత్రాలు చూపించాలన్నారు. అదే విధంగా ఎన్నికల నిబంధనల ప్రకారం మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పీఎంజేజేవై చెక్కు అందజేత

కౌటాల, ఏప్రిల్ 18: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన ఆలం మీరాబాయి మృతిచెందడంతో ఆమె కుమారుడు సురేష్‌కు ఎస్బీఐ లైఫ్ సంస్థ నుంచి వచ్చిన రెండు లక్షల పీఎంజేజేవై చెక్కును తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ మనోహర్, సిబ్బంది రాజేష్, గోపి, భాస్కర్, నీరజ, మోరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమం వెనుక బాలుడి అస్తికలు

- ● వైద్యం వికటించడంతో మృతి
- ● వైద్యుడితో కలిసి పూడ్చిపెట్టిన తండ్రి
- ● నాలుగేళ్ల క్రితం ఘటన
- ● అస్తికలను వెలికితీసిన పోలీసులు
- ● తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన వైనం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్లో) రిషి

రెబ్బెన, ఏప్రిల్ 18: రెబ్బెన మండలం పాసిగాం గ్రామంలోని ఓఆశ్రమం వెనకాల గురువారం పోలీసులు ఓ బాలుడి అస్తికలను వెలికితీయడం కలకలం రేపింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు డీఎస్పీ సదయ్య కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నంబాల గ్రామానికి చెందిన సుల్వ శ్రీనివాస్, మల్లేశ్వరికి.. రిషి(11), అఖిల్ అనే ఇద్దరు కుమారులున్నారు. రిషి కాళ్లకు తిమ్మిర్ల సమస్య ఉండగా తండ్రి శ్రీనివాస్ 2020నవంబరులో పాసిగాం శివారులోఉన్న ఆశ్రమంలో చేర్పించాడు. ఈ ఆశ్రమాన్ని అదే గ్రామానికి చెందిన భీం రావు నిర్వహిస్తూ అనారోగ్య సమస్యలతో ఆశ్రమానికి వచ్చే వారికి నాటువైద్యం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆశ్రమంలో చేరిన రిషికి సైతం భీంరావు తనకు తెలిసిన నాటువైద్యం చేశాడు. అది వికటించటంతో రిషి మృతిచెందాడు. విషయం బయటికి పొక్కితే ఆశ్రమానికి చెడ్డపేరు వస్తుందనే నెపంతో బాలుడి మృతదేహాన్ని ఆశ్రమం వెనుకభాగంలో పాతిపెట్టారు. అప్పటికే భీంరావు మాయలో ఉన్న శ్రీనివాస్ సైతం తన సొంత కుమారుడిని ఎవరికీ తెలియకుండా పాతిపెట్టేందుకు భీంరావుకు సహకరించాడు. కుమారుడి మృతి విషయం తెలియని తల్లి మల్లేశ్వరి తన కుమారుడి కోసం పలుమార్లు భర్తను ప్రశ్నించగా ఆశ్రమంలో ఉన్నాడని బుకాయించాడు. ఇలా నాలుగేళ్లుగా మభ్యపెడుతూ రాగా కుమారుడిని ఆచూకీపై తల్లికి అనుమానం వచ్చింది. దీంతో పోలీసులను ఆశ్రయించగా వారు రంగంలోకి దిగి నిర్వాహకుడితో పాటు భర్త శ్రీనివాస్‌ను విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది.

నాలుగేళ్ల తర్వాత..

ఆశ్రమ నిర్వాహకుడితోపాటు బాలుడి తండ్రిని గురువారం పోలీసులు పాసిగాం శివారులో ఉన్న ఆశ్రమానికి తీసుకెళ్లారు. వారు బాలుడిని పాతిపెట్టిన స్థలాన్ని చూపించారు. రెబ్బెన తహసీల్దార్ జ్యోత్స్న సమక్షంలో బాలుడిని పూడ్చిపెట్టిన స్థలంలో నాలుగు ఫీట్ల మేర తవ్వారు. దీంతో మృతదేహం అస్తికలు బయటపడ్డాయి. ఫోరెన్సిక్ వైద్యులు సురేందర్‌రెడ్డి మృతదేహానికి సంబంధించిన అస్తికలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. పరీక్షల అనంతరం లభ్యమైన అస్తికలు ఎవరివి అనే విషయాన్ని డీఎన్ఏ పరీక్ష చేయిస్తామని సీఐ చిట్టిబాబు తెలిపారు. డీఎన్ఏ, ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

మంత్రి సీతక్కపై ఆరోపణలు చేయడం సరికాదు

● సిర్పూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 18: మంత్రి సీతక్కపై ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు నిరాధార ఆరోపణలు చేయటం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిని మరిచి మంత్రి, మాజీ ఎమ్మెల్యే కోనప్పతోపాటు తనపై నిరాధార ఆరోపణలు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పరువు నష్టం దావా కూడా వేయనున్నట్టు తెలిపారు. గిరిజన మహిళ అయిన మంత్రి సీతక్కపై లేనిపోని ఆరోపణలు చేయటం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనప్ప, తాను ప్రజాసేవ చేస్తున్నట్టు తెలిపారు. రైస్‌మిల్లు యాజమానుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు తీసుకొని వారికి ఎమ్మెల్యే వత్తాసు పలుకుతున్నట్టు ఆరోపించారు. జిన్నింగ్ మిల్లుల యాజమానులతో కుమ్మక్కై పత్తిరైతులకు నష్టం చేసినట్టు ఆరోపించారు. మంత్రి ఆమోదంతో సిర్పూరు రోడ్డు, అందవెల్లి పనులను శరవేగంగా కొనసాగిస్తూ ఆ పనులను సందర్శించి సోషల్ మీడియాలో తానే చేసినట్టు చెప్పుకోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు మాజీమున్సిపల్ ఛైర్మన్ దస్తగీర్, వివి ప్రసాద్, వార్డ తిరుపతి, ఫైసల్‌బీన్ సులేమాన్, కౌన్సిలర్లు ఎల్లేష్, రాము, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

బెజ్జూరు: మంత్రిసీతక్క, కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అసత్య ఆరోపణలు మానుకోవాలని బ్లాక్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనురాలు అయిన మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సీతక్క పేరుచెప్పి నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారనడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామ న్నారు. చిల్లర రాజకీయాలు మానుకోకుంటే తగినమూల్యం చెల్లించక తప్పదన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సిర్పూర్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శంకర్, హకీం, కోఆప్షన్ సభ్యుడు భషరత్‌ఖాన్, ఎంపీటీసీ వెంకన్న, కొండ్ర నరేందర్‌గౌడ్, మహేష్, సతీష్, షౌకత్‌అలీ తదితరులు ఉన్నారు.

గాయపడిన మహిళ మృతి

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని బూర్గుడ గ్రామంలో బుధవారం వీచిన ఈదురు గాలులతో చిన్నక్కపై చెట్టు విరిగిపడడంతో తీవ్రగాయాలు అయ్యాయి. కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. మంచిర్యాలలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించండి

చితలమానేపల్లి, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ కోరారు. గురువారం చింతలమానేపల్లి మండలంలోని కర్జవెల్లి, చింతలమానేప ల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కనకయ్య, శేఖర్, శంకర్, షాహీద్, రాంబాబు, శైలజ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

'అరిగెల' చేరికతో పార్టీకి మరింత బలం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18: సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు బీజేపీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరినట్టయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. అరిగెల నాగేశ్వర్‌రావు తన అనుచరగనంతో ఇటీవల బీజేపీలో చేరి ఆసిఫాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ నాయకులైన నాగేశ్వర్‌రావు బీజేపీలోకి రావడం చాలా సంతోషకర విషయమ న్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గొడెం నగేష్ గెలుపు కోసం కృషిచేయాలని పేర్కొన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ అరిగెల సోదరులు పార్టీలో చేరడంతో పార్టీ మరింత పటిష్టం కానుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫల మైందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని కలిసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధాని మోదీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బీజేపీలో చేరానన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థికి 50వేలమెజార్టీ తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని అందుకు అందరి సహాయ సహకారాలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా అరిగెల బ్రదర్స్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎమ్మెల్యే హరిష్ బాబు ఘనంగా సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలోకి చేరిన పలువురు నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొట్నాక విజయ్, మురళీ, విశాల్, అంజనేయులుగౌడ్, చక్రపాణి, కిరణ్, కృష్ణకుమారి, సొల్లులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 18: బూర్గుడలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులతో పలువురి ఇళ్ల పైకప్పు రేకులు లేచి పోవడంతో పాటు జరిగిన నష్టానికి నష్టపరిహారం చెల్లించి బాధితులను ఆదుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో పర్యటించి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదురుగాలులతో 15కుటుంబాలు నష్టపోయాయన్నారు. వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు శివ, విశాల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పర్వం షురూ..

● ఆదిలాబాద్‌లో తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రాథోడ్‌సుభాష్

ఆదిలాబాద్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ పర్వం మొదలయ్యింది. గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిన అధికారులు ఆ వెనువెంటనే మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను చేపట్టారు. తొలిరోజు రెండు నామినేషన్‌లు దాఖలయ్యాయి. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఆదిలాబాద్ జిల్లాకలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణను ప్రారంభించారు. ఎన్ని కల రిటర్నింగ్ అధికారి కార్యాలయ ఆవరణలో పటిష్టమైన నిఘా, భద్రతను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజార్షిషా నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

● తొలిరోజు ప్రశాంతం

తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు కాగా ఆధార్‌పార్టీ అభ్యర్థిగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవి పాడ్ గ్రామానికి చెందిన మాలోత్‌శ్యామ్ లాల్‌నాయక్ తన మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే ఇచ్చోడ మండలానికి చెందిన రాథోడ్‌సుభాష్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ను వేశారు. టికెట్ ఆశించిన భంగపడ్డ కొందరు సీనియర్ నేతలు కూడా నామినేషన్ వేసేందుకు తమ అనుచరులతో మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. తమ సామాజిక వర్గం, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల మద్దతుతో లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అవకాశాలు లేక పోలేదు. 19, 21 తేదీలలో మరికొంత మంది స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్ దాఖలు చేసే అవకాశం కనిపిస్తుంది.

ఆ... 12 గ్రామాల్లో నేడే పోలింగ్



పరందోళిలో పాఠశాలలో ఏర్పాటు చేసిన చంద్రాపూర్ పార్లమెంట్ పోలింగ్ కేంద్రం

కెరమెరి, ఏప్రిల్ 18: కెరమెరి మండలంలోని వివాదాస్పద 12 గ్రామాలు మహారాష్ట్ర చంద్రాపూర్ నియోజక వర్గ పరిధిలో, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. దీంతో చంద్రాపూర్ పార్లమెంట్ నియోజక వర్గానికి శుక్రవారం ఎన్నికలు జరుగుతుండడంతో ఆ12గ్రామాల ప్రజలు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. కెరమెరి మండలంలోని పరందోళి, పరందోళి తండా, మొగ్దుంగూడ, కోట గ్రామాలకు పోలింగ్‌కేంద్రాలను పరందోళిలో ఏర్పాటుచేశారు. అలాగే అంతాపూర్ నారాయణ గూడ, గౌరిగ్రామాలకు కలిపి కుందేరురి(కొడియిన్ మోవాడ్)లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ 12గ్రామాల పరిధిలో 3357 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకో నున్నట్లు మహారాష్ట్ర అధికారులు తెలిపారు. చంద్రాపూర్ పార్లమెంట్‌బరిలో సుధీర్‌ముదిగంటివార్(బీజేపీ),ప్రతిభ ధనోర్కర్ (కాంగ్రెస్), రాజు బహుత్లే(బహుజన్‌అగాడి) నుంచి పోటీలో ఉండగా స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు.

వ్యాపారి ఇంట్లో పోలీసుల విస్తృత తనిఖీలు

బెజ్జూరు, ఏప్రిల్ 18: అమాయక ప్రజలను ఆసరా చేసుకుని వడ్డీలు, చిట్టీల పేరుతో ప్రజలను పీడిస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అధిక వడ్డీల పేరుతో ప్రజలను ముక్కుపిండి వసూలు చేస్తున్న వారి ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు కఠినచర్యలు తీసుకుంటున్నారు. గురువారం మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన చిలువేరు శ్రీనివాస్ అనే వ్యాపారం ఇంట్లో కౌటాల సీఐ సాదిక్‌పాషా ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు చేపట్టారు. వడ్డీ వ్యాపారం చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని వచ్చిన ఆరోపణల మేరకు ఆయన నడుపుతున్న ఫెర్టిలైజర్ దుకాణం, ఇంట్లో తనిఖీలు చేపట్టగా వడ్డీ వ్యాపారానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లభించలేదని సీఐ తెలిపారు. అదేవిధంగా శ్రీనివాస్‌కు సంబంధించిన కిరాణా దుకాణంలో తనిఖీ చేయగా 13 మద్యం బాటిళ్లు లభ్యం అయ్యాయి. ఈ మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో చిట్టీలు, వడ్డీల వ్యాపారంతో అమాయక ప్రజలను మోసం చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై విక్రం, పోలీసులు ఉన్నారు.

జిల్లాలో 44.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18: జిల్లాలో గురువారం 44.2డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కౌటాల, కాగజ్‌నగర్ మండలాలలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా రెబ్బెనలో 43.9, బెజ్జూర్‌లో 43.7, దహెగాంలో 43.5, చింతలమానేపల్లిలో 43.0, తిర్యాణిలో 42.9, సిర్పూర్(టి)లో 42.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం



అపరిశుభ్రంగా కనిపిస్తున్న హేటిగూడ గ్రామం

- జిల్లాలో ప్రత్యేకాధికారులతో పాలన
- సిబ్బందికి సైతం వేతనాలు సకాలంలో రాకపోవడంతో నిరాసక్తి
- జిల్లాలో 335 గ్రామపంచాయతీలు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 18: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేక పాలనకు జిల్లాలో సరిపడా గెజిటెడ్ అధికారుల కొరత ఉండడంతో ఒక్కో అధికారికి నాలుగైదు గ్రామపంచాయతీల బాధ్యతలు అప్పగించారు. పంచా యతీ అధికారులు, గ్రామ సిబ్బందితో కలిసి అభివృద్ధి పనులు చేపట్టాలి. అయితే ప్రత్యేకా ధికారుల పాలన కొనసాగి మూడు నెలలపైనే కావస్తున్నా గ్రామాలను వారు సందర్శించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు ఒక్కో అధికారికి మూడు, నాలుగు జీపీల బాధ్యతలు అప్పగించ డంతో ఏ గ్రామాన్ని సరిగా పర్యవేక్షించలేకపోతున్నారు. అలాగే చాలామంది తహసీల్దార్లు, డిప్యూటీతహసీల్దార్లు, పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంలు, ఇంజనీ రింగ్ విభాగం నుంచే ప్రత్యేకాధికారులు ఉండడంతో వారు నిర్వహిస్తున్న శాఖ పనితీరు చూసుకోవడం, మళ్లీ గ్రామపంచాయతీల బాధ్యతలు అద నంగా చూడడం వారికి భారమవుతోంది. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్థంగా తయారవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పారిశుధ్యం అస్థవస్థం..

జిల్లాలోని చాలా గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం అస్థవ్యస్థంగా మారింది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, జీపీల్లో పని చేస్తున్న కార్మికులకు సైతం నెలనెలా వేతనాలు రాకపోవడంతో వారు కూడా పనులు చేయడానికి నిరాసక్తి కనబరుస్తున్నారు. రోజుల తరబడి మురికి కాలువల్లో పూడిక తీయక దుర్గంధం వెదజల్లుతోంది. కొన్నిగ్రామాల్లో పందుల స్వైరవిహారంతో గ్రామాలు కంపు కొడుతున్నాయి. దీంతో దుర్వాసనతోపాటు దోమలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెత్తా చెదారం కూడా ఎక్కడికక్కడే పేరుకుపోతోంది. దీనికి తోడు తాగునీరు కోసం మిషన్ భగీరథ ద్వారా పంపిణీ చేసే నీరు కూడా చాలా గ్రామాల్లో సరఫరా కావడం లేదు. తాగునీటి వనరులు మరమ్మతులకు గురైనా పట్టించు కోవడం లేదన్న విమర్శలున్నాయి. పారిశుధ్యం, తాగునీరు వంటి వాటిపై ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

● పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు..

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలుండగా, 124మంది గెజిగెడ్ అధికారులు ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. అయితే గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేకాధి కారులు తమ సెల్‌ఫోన్ ద్వారా గ్రామాల పరిస్థితులు ఆరా తీయడం, సూచనలు చేయడం వంటివి మాత్రమే చేస్తున్నారు. అయితే ప్రత్యేకా ధికారులుగా నియమితులైన అధికారులు విధిగా వారంలో కనీసం రెండు సార్లు అయినా తమకు కేటాయించిన గ్రామ పంచా యతీలను సందర్శించి అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి. కానీ నెల రోజులకోసారి కూడా గ్రామ పంచాయతీల ముఖం చూడడం లేదన్న విమర్శలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..

\- భిక్షపతిగౌడ్, డీపీవో

జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నాం. ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉంటూ పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మి కులకు వేతనాలు సకాలంలో అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ వారం రోజుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతాం.

సహాయక పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన సహాయక పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి సిర్పూర్, ఆసిఫాబాద్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని తహసీల్దార్‌లు, ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్(001) నియోజకవర్గపరిధిలోని జిల్లాలోని సిర్పూర్(001), ఆసిఫాబాద్(005)శాసనసభ నియోజకవర్గ పరిధిలో మే13న జరుగనున్న పోలింగ్‌ప్రక్రియలో భాగంగా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, మూత్రశాలలు, నీడ తదితర సౌకర్యాల కల్పనతో పాటు వయోవృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు ర్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాపై పోలింగ్ కేంద్రం వివరాలు చిరునామా సరి చూసుకోవాలని ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరి చేయాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రత దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తప్పని సరిగా అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ విధులలో ఉన్న సిబ్బందికి అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. మహిళాసిబ్బంది, దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేకఏర్పాట్లు చేయాలని తెలిపారు. తహసీల్దార్లు తమపరిధిలోని ప్రతిపోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పూర్తివివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. సెక్టార్ అధికారులు, బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లారెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ ఆర్డీవోసురేష్, తహసీల్దార్ ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ స్వీకరణను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదిలాబాద్(001) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలోని సిర్పూర్ (001), ఆసిఫాబాద్(005) అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 25వరకు (ప్రభుత్వ సెలవు రోజులు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆదిలాబాద్‌లోని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్, సహాయరిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదిలాబాద్‌కు రాజకీయపార్టీలు, అభ్యర్థులు తమ నామినేషన్ సమర్పించ వచ్చన్నారు. నామినేషన్ ఫారాలను నిర్దేశిత పని వేళలలో పొందవచ్చని తెలిపారు. ఈనెల 26తేదీ ఉదయ 11గంటల నుంచి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్‌లో నామినేషన్ల పరిశీలన జరుగుతుందన్నారు. అభ్యర్థిత్వం ఉపసంహరించుకొను నోటీసును అభ్యర్థి స్వయంగా కానీ, ప్రతిపాదకులచేకానీ, ఎన్నికల ఏజెంట్‌కు కానీ అభ్యర్థి చేత రాత పూర్వకంగా ఈనెల29తేదీ మధ్యాహ్నం 3గంటలలోగా అందజేయవచ్చని తెలిపారు. తుదిజాబితా అనంతరం మే13న ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిసౌకర్యాలు కల్పిస్తామన్నారు. పోలింగ్‌రోజున ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపుకార్డులలో ఏదైనా ఉపయోగించుకొని ఓటు వేయవచ్చని తెలిపారు.

కలెక్టరేట్‌లో తాగునీటి ప్లాంటు ఏర్పాటు

వేసవిదృష్ట్యా వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కి వచ్చే ప్రజలు కార్యాలయంలోని అధి కారులు, సిబ్బంది కొరకు తాగునీటి ప్లాంటు ఏర్పాటు చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను ఆయన అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ప్రజలసౌకర్యార్థం ఈ తాగునీటి ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 18: అగ్నిప్రమాదాలు సంభవించినపుడు అప్రమత్తంగా ఉండాలని ఫైర్‌అధికారి రాజేందర్ పేర్కొన్నారు. అగ్నిమాపకవారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని భారత్ పెట్రోలియం పంప్, ఎల్పీజీగ్యాస్ గోడౌన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్యల గురించి వివరించారు.

కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రాజేందర్, సతీష్‌కుమార్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క పేరిట వసూళ్ల దందా


● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 : జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేరిట సిర్పూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. గురువారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైస్‌మిల్లింగ్ పౌరసరఫరాలకు ఇవ్వగా సిర్పూరులో మాత్రం రైస్‌మిల్లింగ్ వ్యవస్థను ఎఫ్‌సీఐకి ఇవ్వటమేంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తాము గతంలోనే ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. రైస్‌మిల్లర్లను బెదిరించి మళ్లీ అక్రమ వసూళ్లకు పాల్పడేందుకు ఈ చర్యకు పాల్పడినట్టు పేర్కొన్నారు. ఈ దందాలో కూడా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, అల్లుడు రావి శ్రీనివాస్ హస్తం ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గానికి ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు రూ.6కోట్లు మంజూరు కాగా కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు పనులు కేటాయించాలని రావి శ్రీనివాస్ సిఫార్సు చేయటం, మంత్రి వాటిపై సంతకం పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానికంగా ఉండే మహిళా వైద్యురాలిని భయాంభ్రాంతులకు గురిచేసి లక్షల్లో డబ్బులు డిమాండు చేయటం దారుణమన్నారు. అలాగే రియల్ ఎస్టేట్ సర్వేనెంబరు 146/2లోని వెంచర్ వేయగా, ఇందులో కూడా డబ్బులు వసూలు చేసినట్టు పేర్కొన్నారు. మంత్రి సీతక్క పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిని వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, వీర భద్రాచారి, సిందం శ్రీనివాస్, కొప్పుల శంకర్, గోలేం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చుక్క నీటి కోసం పిచ్చుకల పాట్లు



నీటికోసం చేతిపంపు వద్ద పాట్లు పడుతున్న పిట్ట

సిరప్పూర్(యు), ఏప్రిల్ 18: మండలంలో కొద్దిరోజులుగా భానుడు భగభగ మండుతున్నాడు. ఉదయం 9గంటలు అయిందంటే జనాలు బయటకు రావడం లేదు. వేసవి తాపం ఒక్క మనుషులకే కాదు...మూగ జీవాలకు కూడా. గురువారం పగటిపూట చుక్కనీటి కోసం చేతిపంపు వద్ద పిచ్చుకలు పడిరాని పట్లు పడ్డాయి. దాహం కోసం తహతహలాడాయి. కొందరు చేతి పంపు వాడగా వచ్చిన నీటిని తాగి దప్పిక తీర్చుకున్నాయి.



ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18: ఓబీ కంపెనీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికసంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలోని ఓబీ కంపెనీలలో ఆయన పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. సీఆర్‌ఆర్ కంపెనీలో పనిచేస్తున్న 24మంది నుంచి 12మంది బ్లాస్టింగ్ కార్మికులను తొలగించాలనే యోచనలో కంపెనీ యాజమాన్యం ఉందని, వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఐదురోజులుగా బోనస్ సమస్య పరిష్క రించాలని విధులు బహిష్కరించి నిరసనలు తెలుపుతున్నా యాజమాన్యం స్పందించడం లేదని ఆరోపించారు. ఏడాదికి ఓమారు ఇవ్వాల్సిన బోనస్ 18 నెలలైనా ఇవ్వకపోవడం దారుణమన్నారు. 8.33శాతంతో బోనస్ చెల్లించి పనులు కొనసాగించే విధంగా చూడాలని ఆయన సింగరేణి అధికారులను కోరారు. కార్యక్రమంలో ఓబీబ్లాస్టింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18: కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని, కార్మికవర్గం ఒక్కటిగామారి సంస్థలను కాపాడుకోవాలని ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి టిశ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1973నుంచి ఇప్పటివరకు ఉన్నసంస్థలను కార్పొరేట్‌శక్తులకు, సహజసంపదలను పెట్టుబడిదారులకు అమ్మాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగించిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పలుహామీలు ఇచ్చిందని, వాటిని వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణికాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం, రాష్ట్ర నాయకురాలు శోభ, డివిజన్ ప్రధానకార్యదర్శి శంకర్, ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, టీజీఎల్‌టీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

ఐటీ మంత్రిని కలిసిన నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18: ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నెలవేని కుమార్ గురువారం కలిశారు. సింగరేణి కార్మికుల సమస్యలు వివరించారు. రూ.25లక్షల వడ్డీలేని రుణాన్ని ఇప్పించాలని, ఆదాయపుపన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని, డిపెండెంట్ అభ్యర్థుల వయోపరిమితిని 35నుంచి 40ఏళ్లకు పెంచాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సంస్థలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్‌కు అనుబంధంగానే టీబీజీకేఎస్

● యూనియన్ స్టీరింగ్ కమిటీ నిర్ణయం
● గతం మరిచిపోండి... పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పనిచేద్దాం
● నాయకులకు కేటీఆర్ హితవు



కేటీఆర్‌తో టీబీజీకేఎస్ సభ్యులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18: సింగరేణిలో బీఆర్‌ఎస్‌కు అనుబంధంగానే తాము కొనసాగుతామని టీబీజీకేఎస్ స్టీరింగ్‌కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఛైర్మన్ మిర్యాల రాజిరెడ్డి నేతృత్వంలో గురువారం సింగరేణిలోని 11ఏరియాలకు చెందిన పలువురు టీబీజీకేఎస్ నాయకులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావును కలిశారు. పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు కేటీఆర్‌తో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీ, యూనియన్ స్థితిగతుల గురించి 45నిమిషాలపాటు చర్చించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ, గతం మరిచిపోండి, పార్టీ, యూనియన్ మధ్య తలెత్తిన వివాదం మరిచిపోయి బీఆర్‌ఎస్ పార్టీ, యూనియన్ బలోపేతానికి కృషిచేయాలని కోరారు. యూనియన్‌కు అన్నివిషయాల్లో అండగా ఉంటామని, ఈనెల 24న గోదావరిఖనిలో జరిగే జనరల్ బాడీ సమావేశంలో కొప్పుల ఈశ్వర్ హాజరై అన్ని విషయాలు చర్చిస్తారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా 5 స్థానాల్లో అభ్యర్థులు విజయం సాధించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ నాయకులు కలిసికట్టుగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు పెట్టం లక్ష్మణ్, బండి రమేష్, పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సభ్యత్వాలు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18: ఐఎన్‌టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్పీ3 గనిపై గురువారం సభ్యత్వనమోదు చేపట్టారు. పలువురు కార్మికులను కలుసుకొని వారికి సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు మాట్లాడారు. తమ యూనియన్ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందన్నారు. ఈనెల21న గోదావరిఖనిలో జరిగే యూనియన్ మహాసభకు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి సంజీవరెడ్డి, జాతీయ కార్యదర్శి బి జనక్‌ప్రసాద్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు హాజరవుతారని అన్నారు. కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి శీలం చిన్నయ్య, ఎస్‌ఆర్‌పి 3, ఆర్‌కె 7 పిట్ కార్యదర్శులు పెట్టం శ్రీను, శ్రీకాంత్, నాయకుడు గోపాల్ పాల్గొన్నారు.

సింగరేణిలో హక్కులు సాధించింది ఐఎన్టీయూసీనే

మందమర్రిటౌన్, ఏప్రిల్ 18: సింగరేణిలో కార్మికుల సంక్షేమంతోపాటు హక్కులు సాధించి పెట్టిన ఘనత ఐఎన్టీయూసీదేనని ఆ యూనియన్ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 21న గోదావరిఖనిలో మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ సభలకు సంజీవరెడ్డితోపాటు మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, విజయరమణరావుతో పాటు మక్కన్‌సింగ్, కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సభలకు ప్రధానంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమంతో పాటు రాబోయే రోజుల్లో కార్మికులకు చేయబోయే కార్యక్రమాలను వివరిస్తామని పేర్కొన్నారు. భారీ మెజారిటీతో పెద్దపల్లి స్థానాన్ని గెలిపిస్తామని వారు పేర్కొన్నారు. సమావేశంలో రాంశెట్టి నరేందర్, సూర్యనారాయణ, లక్ష్మణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపిక

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18 : బూస లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు, జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) జిల్లా అధ్యక్షుడు ఆర్ముళ్ల రాజును బెస్ట్ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజు చేస్తున్న సమాజసేవ, యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నందున ఆయనకు గోదావరిఖనిలో శుక్రవారం అవార్డును అందించనున్నట్లు పేర్కొన్నారు.